సాయంకాలం. సూర్యుడింకా అస్తమించలేదు. పెద్ద పెద్ద మేడలు, తమ నీడలను రోడ్డు మీదకు ప్రసరింపజేస్తున్నాయి. రోడ్డు మీద కోలాహలం ఎక్కువగానే వుంది.

# ఆ గదిలో....

డాక్టర్ జయానాగరాజు

ఆ జనంలో బిక్కమొగం వేసుకొని అటు యిటు చూచుకుంటూ శ్రీరామ్ నడుస్తున్నాడు. వాడిపోయిన ముఖం, పాతబడిన చెప్పులు, నలిగిన ప్యాంటు. చేతిలో సూటుకేసు–హైదరాబాదుకు కొత్త అని కనిపిస్తూనే వుంది.



శ్రీరామ్ చిత్రకారుడు. ఒక ఎడ్వర్‌టైజింగ్ కంపెనీలో డిజైన్ ఆఫీసరుగా ఉద్యోగం సంపాయించి కొవ్వూరు దగ్గిర చిన్న పేట కుగ్రామం నుంచి వచ్చాడు. ఇల్లు వదలడం యిదే మొదటిసారి. విరామం లేకుండా పరుగెత్తే కార్లు, బస్సులు, ఆటోలు, బిరబిరా నడిచి వచ్చేపోయే జనం— ఇవన్నీ ఎందుకో శ్రీరామ్‌ని చికాకు పరిచాయి. ఉద్యోగంకోసం వచ్చేటప్పుడు వున్న ఆనందం రెండు రోజులలోనే అణగారిపోయింది. భాష క్రొత్త.... హిందీ శ్రీరామ్‌కు అంతగా రాదు. మెల్లిగా "టీ" కొట్లోకి పోయి కూర్చున్నాడు. వేడి వేడి టీ త్రాగుతూంటె ఎందుకో అమ్మ గుర్తుకొచ్చింది. "నీ ఆరోగ్యం అసలే మంచిది కాదు. జాగ్రత్త. రాత్రి నిద్ర కాయకు...!" అని మరీ మరీ చెప్పింది. అప్పుడే రెండు రాత్రుల నుంచి సరిగ్గా నిద్రలేదు. నీరసంగా వుంది. మధ్యాహ్నం భోజనంకూడా చెయ్య లేదు. "టీ"కొట్లో అతను తెలుగుమాట్లాడ్డంవిని శ్రీరామ్ అతన్ని పిలిచి "ఈ వూర్లో తక్కువఅద్దెకు గదులు దొరకవా? ఈ వూరు నాకు క్రొత్త" అని అడిగాడు. "సిటీలో దొరకవు సాబ్. కాని దూరంగా వెళితే వుంటాయి" అన్నాడు. "మరి నీకేమయినా తెలుసా?" శ్రీరామ్ ప్రశ్న. "ఆ. ఫలక్‌నూమాలో రతన్ మంజిల్ వుంది. అందులో గదులుంటాయి. దూరమైనా బస్సులున్నాయి" అన్నాడు. శ్రీరామ్ చిరునామా రాసుకొని ఆనాటికి రాయల్ లాడ్జికి వెళ్ళాడు. వచ్చే నాలుగు వందలలో అమ్మ నాన్నకు పంపాలి. చెల్లి పెండ్లి వుంది. తను కొంచెం పొదుపు చేయాలి. దూరమైనా ఫరవాలేదు. బస్సు పాసు తీసుకోవచ్చు. అలా ఆలోచిస్తూ నిద్ర లోకి జారాడు.

* * * *

మరునాడు ఆదివారం. శ్రీరామ్ బద్దకంగా లేచాడు. యింటి వద్దఆదివారంనాడు అమ్మ యిడ్లీలు చేస్తుంది. నోరూరింది. గబ గబా "తాజ్‌మహల్" హోటెల్‌కు వెళ్ళి వస్తూ వుండగా భుజం మీద ఓ చెయ్యి పడింది. ఉలిక్కిపడి వెనక్కి చూచాడు శ్రీరామ్. కృష్ణమూర్తి— తన కంపెనీలోనే పని "ఎక్కడికోయి? ఆదివారం కదా మా యింటికి రారాదూ ..." అన్నాడు. "ఈ వేళ కాదోయి. ఫలక్‌నూమా దగ్గర ఏవో గదులు ఖాళీగా వున్నాయట చూడాలి. హోటల్‌లో ఎన్ని రోజులు?" అన్నాడు. "ఫలక్‌నూమా! "రతన్ మంజిల్" లోని గది కాదుకదా" అడిగాడు కృష్ణమూర్తి అనుమానంగా. "ఏం? అదే అడ్రస్. బాగుం డదా?"

కృష్ణమూర్తి నీళ్ళు నములుతూ "అబ్బే. ఏంలేదు ఊరికే అడిగాను; అంటే దూరంకదా అని" అని గబగబా వెళ్ళిపోయాడు. "ఈ పట్నాలలో మరీ విడ్డూరం" అనుకున్నాడు శ్రీరామ్.

ఎన్నో బస్సులు మారి శ్రీరామ్ ఫలక్‌నూమా చేరాడు. అక్కడ "రతన్ మంజిల్" కను క్కోవడం శ్రమకాలేదు. పురాతన భవనం. మూడంతస్తులది. ఏ నాటి దో. "పిపాషా" తన "బీబీ" కోసం కట్టించింది. ఈనాడు దానికి వెల్లవేసే దిక్కు కూడా లేనట్లుంది. పెచ్చులూడిపోతున్న గోడలు, విరిగిన వగిషీ కిటికీ తలుపులు గాలికి రెపరెపలాడుతున్నాయి. ఓ చీకటి సందులో వుంది రతన్ మంజిల్. తన పూర్వపుశోభను దాటాలని విఫలంగా ప్రయత్నిస్తూ వుంది. చుట్టూ అన్నీ ముస్లిమ్స్ యిళ్ళే.

గళ్ళ లుంగీ, గడ్డం. కొంచెం నెరిసిన బట్టతల. కండ్ల వెనుక దాగున్న కరడుగట్టుకున్న విచారం. బయటకు వచ్చిన ఆసామి వచ్చీరాని తెలుగులో ఏం కావాలని శ్రీరామ్‌ని అడిగాడు. "మీ యింట్లో మేడమీద ఓ గది అద్దెకుందని విన్నాను. అందుకోసం" అని శ్రీరామ్ యింగ్లీషు, తెలుగు హిందీ కలిపి అన్నాడు. "మీరు...." అని ఆగి.... "ఈ వూరి వారు కారా" అని ఎదురు ప్రశ్న వేశాడాయన. "కాదు ... ఆంధ్ర" అన్నాడు. దానికి ముసలి ముస్లిమ్ గట్టిగా వూపిరిపీలుస్తూ.... చిరునవ్వుతో "ఇస్తాను బేటా. అద్దెకేముందిలే తరువాతఇద్దువుగాని" అని శ్రీరామ్ వూరు పేరు ఉద్యోగం అన్నీ అడిగి తెలుసు కొని పీపునిమిరాడు. ఈ కాని వూర్లో, ఈ మారు మూల, స్వజాతీయుడు కూడా కాని వాడు తనని ఇంత ప్రేమగా మాట్లాడించే వరికి ఇంకేమీ అడగకుండా గది చూపించమన్నాడు. ఎన్నోగదులున్నా రెండుమూడు కుటుంబాలుతప్ప ఆ మంజిల్‌లో లేరు. బయట ద్వారానికి ఆనుకునే వున్నాయి కర్ర మెట్లు. మొదటి అంతస్తు బాగానే వుంది, అక్కడక్కడ విరిగి పోయినా కూడా. ఈ అంతస్తులోనే ముసలాయన అతని పరివారం వుంటుంది. మూడో అంతస్తుకు ఎక్కే మెట్లమీద కావలసినంత



## వ్యవహార పంచమి

చిన చేపలు, పెద చేపలు
ఘనమైన తిమింగలములు, గ్రక్కున మ్రింగే
వన చరములు కోకొల్లలు
కనుమా! అవినీతి కడలి కడుపున పూభా!

ఆలోచన లెందుకులే
ఏ లంచంబీయకుండ ఈ దినములలో
ఫాలాక్షుని పని యైనను
మూలంబడి దిక్కులేక మూల్గును పూభా!

లంచము కోరెడు వారలు
మంచియు చెడు వావి వరుస మర్యాదలులో
నెంచరు, పనులను జేయరు
కొంచెము గొప్పగనో దాని గుడువక పూభా!

తమకన్న మిన్న లేరని
తమ పదవుల బట్టి మదిని తలపోసినచో
తమ తమ పదవులు పోయిన
తమ భృత్యులె శత్రులగుట తథ్యము పూభా!

తలనున్న కేశముల వై
దొలఁగించిన విలువ నుడిగి తుక్కగు రీతిన్
నిలలో పదవీ భ్రష్టులు
వెలవెల బోయెదరు విలువ వెడలగ పూభా!

—పూభా

దుమ్మూధూళీ వుంది. అదివరకు చాలా కాలంగా ఆ మెట్లు ఎవ్వరూ ఎక్కినట్లులేదు. కొంచెం "కిర్రు కిర్రు" మంటున్నాయి వూగుతూ. మెట్లమీద వెలుతురు తక్కువ. 'పూర్వపు ఇండ్లలో గాలి వెలుతురు దూరనివ్వరుగా' అని సరిపెట్టుకున్నాడు శ్రీరామ్. మూడో అంతస్తుమీద వుందా గది. దీనితోపాటు మరో మూడు గదులున్నా అన్నీ తాళాలతోనే వున్నాయి. ఇంకా ఏం అనిఅడగకుండానే ముసలాడు "ఇందులో మా సామానులున్నాయి. అయినా పాత యిల్లు, మరమ్మతు చేయాలి....." అని సణిగాడు.. మేడమీద ఒక మూల గది. గది తలుపు వద్ద ఏ మాత్రం వెలుతురు లేదు. అతి కష్టం మీద యజమాని తడుముకుంటూ గది తలుపులు తీశాడు. 'కిర్రు' మంటూ గది తలుపులు తెరచుకున్నాయి. వెంటనే గబ్బిలాల కంపు. ఒక మాదిరి వేడిగాలి శ్రీరామ్‌ని ఎదుర్కొన్నాయి. "ఈ గదిలో యిదివరకు ఎవ్వరూ లేరా....." అని అనుమానాన్ని ఆపుకోలేక అడిగాడు శ్రీరామ్. "అబ్బే మొన్ననే ఒకాయన వుండి వెళ్ళాడు. గది బాగు చెయ్యలేదు. నీవు వచ్చేలోగా సాఫ్ చేయిస్తా బేటా....." అన్నాడు కంగారుగా. ముసలాడు ఏమి దాస్తున్నాడో శ్రీరామ్‌కు అంతుబట్టలేదు. శ్రీరామ్ మెల్లిగా ఆ చీకటి గదిలోకి పోయి అతికష్టం మీద ఒక కిటికీ రెక్క తీయగానే గబుక్కున వచ్చిన వెలుతురుకు ఓ గుడ్లగూబ గుడ్లు మిటకరిస్తూ 'టపటప' రెక్కలు ఆడించుకుంటూ ఓకూత కూసి ఆ మేడ మీది మరో మారుమూలకు ఎగిరిపోయింది. గది నలుమూలలూ బూజు. దుమ్ము. చినిగిపోయిన పాతకాలపు దిన పత్రికలు. ఆ గదిలో ఎవ్వరూ నివశించలేదు చాలా కాలంగా అని తెలిసిపోయింది శ్రీరామ్‌కు 'ఎందుకు.. ఎందుకు' శ్రీరామ్ మెదడులో ప్రశ్న మెరిసినా ముసలివాని ఆప్యాయతకు లొంగిపోయాడు.

గది పెద్దదే. ఒక కిటికీ రోడ్డుముఖకు వుంది. వూచలు లేవుగాని రంగు రంగు అద్దాలు అమర్చి వున్నాయి. అందులో కొన్ని పగిలి వున్నాయి. మరో కిటికీలోంచి మసీదు కనిపిస్తుంది. ఆ మసీదుకూడా ఈ మంజిల్‌లాగా చాలా పురాతనం. ఎన్నో గువ్వ పిట్టలకు నివాసం. ఒక్కసారి ఆ మసీదులోనుంచి విన వచ్చిన "నమాజ్"కు వులిక్కిపడ్డాడు శ్రీరామ్. 'కొన్నాళ్ళు అలవాటు పడాలి' అని అనుకొని "గది బాగుచేయించండి బాబా సాయంత్రం వస్తాను" అన్నాడు శ్రీరామ్. ఆ గదిలో ఓ పురాతనపు మంచం, వంకర్లు తిరిగిన కోళ్ళతో వున్న పాత బల్ల, కుర్చీ, ఓ పెద్ద చెక్కపెట్టె వున్నాయి. మెల్లిగా మెట్లు దిగి వెళుతూ వుంటే ఆ యింట్లో కాపురమున్నవారు శ్రీరామ్‌ని వింతగా చూశారు.

*　　*　　*　　*

సాయంత్రం రతన్ మంజిల్‌కు రిక్షాలో తనపెట్టె బేడ పెట్టుకొని వచ్చాడు. అప్పటికే మెట్లు, గది బాగు చేయించాడు ముసలాయన-బల్లమీద ఒక పాత కాలపు చిమ్నీ దీపం కూడా వెలిగించి వుంచారు. అది తన కాంతిని ప్రసరింపజేసి గదిలో ఆవరించిన చీకటిని తరిమికొట్టాలని చూస్తూ వుంది. అయినా కూడా మంచం వెనకాల నల్లని చీకటి తాండవిస్తూ వుంది. మంచంమీద పరుపు దుప్పటి కూడా వేశారు. బాబా వచ్చి "అంతా బాగు చేయించాను బాబు. త్రాగడానికి నీరు, గ్లాసు వుంచాం. మా అబ్బాయి పరుపు వుంటే వేశాము. నువ్వు మా బేటా లాగే వున్నావు నాయనా" అన్నాడు ఎంతో విచారంగా. అంతలోకి బాబా మనుమడు చపాతీలు, బంగాళ దుంపల కూర తెచ్చి బల్లమీద వుంచుతూ "తిను మామూ జాన్" అన్నాడు. ఈ ఆప్యాయతకు వుక్కిరి బిక్కిరైనాడు శ్రీరామ్. "ఏమున్నా కావాలంటే అడుగు. బిడియపడకు బాబు" అంటూ వెళ్ళిపోయాడు బాబా.

చాలా సరదాగావుంది. దూరమైనా మంచి మనస్సుగలవారి మధ్యవున్నానని ఆనందంగావుంది. గదిచాలా పెద్దది. గాలి కూడా బాగానే వస్తుంది. ఓ గబ్బిలంవచ్చి గదిచుట్టూ తిరిగింది. 'పాత అలవాటు' అనుకుంటూ దాన్ని తరిమాడు కాని. గది నాలుగు మూలలా చీకటి క్రీనీడలు. 'పెద్ద దీపం తెచ్చుకోవాలి' అనుకొని తాపీగా శ్రీరామ్ కూర్చొని అమ్మకు వుత్తరం వ్రాశాడు. అందులో తనకు ఆవకాయ పంపమని కూడా వ్రాశాడు. ఈల వేసుకుంటూ బల్లసొరుగు తెరిచాడు. అందులో తుప్పుపట్టిన కైజార్ ఒకటుంది. అది తీసిచూచాడు. మీట నొక్కితే తెరచుకునే కైజారు. మంచి నగిషీ. ఎవరిదో. ఎప్పటిదో. పిడికి ఓ ఎఱ్ఱరాయి వుంది రక్తం బొట్టులా. ఆ వెలుగులో చటుక్కున మెరిసింది. 'ఒకప్పుడు దీనిని మొలలో దోపుకొనే వారు కాబోలు' అని అనుకుంటూ శ్రీరామ్. దాన్ని పట్టుకొని నాటకం ఫక్కిలో త్రిప్పాడు. ఎందుకో ఆ వంకర తిరిగిన కైజారు చాలా మందినే హత్యచేసివుంటుందని హఠాత్తుగా శ్రీరామ్‌కు తోచింది. ఎక్కడో తీతువు అరిచింది. పనికిమాలిన కుక్క ఒకటి మోర ఎత్తి ఏడ్వనారంభించింది. శ్రీరామ్ మనసెందుకో కీడు శంకించింది. కిటికీ దగ్గరకు వెళ్ళి

## పాలగుమ్మి పద్మరాజు రచనా సర్వస్వ ప్రచురణ

కీర్తిశేషులు పాలగుమ్మి పద్మరాజు కథలు సుమారు 60 (మూడు సంపుటాలు) నాటికలు, నాటకాలు (రెండు సంపుటాలు) నవలలు ఆరు (ఆరు సంపుటాలు), కవితలు, విమర్శలు, వ్యాసాలు (ఒక సంపుటం) మొత్తం పన్నెండు సంపుటాలుగా రూపొందించి ప్రచురిస్తున్నారని: పద్మరాజు 70 వ జన్మదినోత్సవం సందర్భంగా జులై 14 న మొదటి సంపుటంతోబాటు పద్మరాజు సాహితీ సంస్మరణ సంచికను విడుదల చేస్తారని సంఘం సభ్యులు శ్రీ భరాగో తెలియజేస్తున్నారు. వివరాలకు : సత్య పబ్లికేషన్స్: నెంబరు 5. సెకండ్ లేన్: లాయడ్స్ రోడ్డు, రాయపేట: మద్రాసు-14 అనే చిరునామాకు వ్రాయవచ్చును.

## శ్రీశ్రీ స్మారక బహుమతి

శ్రీశ్రీ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఇటీవల కిన్నెర ఆర్ట్ థియేటర్ హైదరాబాద్ వారు ఏర్పాటు చేసిన సభలో సంస్థ అధ్యక్షులు శ్రీ యం. వి. నారాయణరావు ప్రతి ఏటా శ్రీశ్రీ పేరుతో ఆయన వర్ధంతి నాడు కిన్నెర శ్రీశ్రీ స్మారక బంగారు పతకం ఉత్తమ కవికి, రచయిత, రచయిత్రికి గాని బహూకరించదలచినట్టు ప్రకటించారు.



16-6-84 కిన్నెర ఆర్ట్ థియేటర్స్ వారు ఏర్పాటు చేసిన శ్రీశ్రీ ప్రథమ వర్ధంతి సభలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సినీ నిర్మాత శ్రీ యం. యస్. రెడ్డి.

సభాధ్యక్షత వహించిన ప్రముఖ సినీ కవి, నిర్మాత శ్రీ యం. యస్. రెడ్డి శ్రీశ్రీ సాహిత్యలోకంలో అమరు డన్నారు. ముఖ్య అతిధి డాక్టర్ సి. నారాయణ రెడ్డి శ్రీశ్రీ ప్రజా కవులిని తయారుచేసిన మహాకవి అన్నారు. ఆచార్య తిరుమల శ్రీశ్రీ

## సమాచారం

సాహిత్యాన్ని సమీక్షించి, ఆధునిక తెలుగు సాహిత్య యుగాన్ని శ్రీశ్రీ యుగమనాలని, ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెంట్రల్ లైబ్రరీకి శ్రీశ్రీ పేరు పెట్టాలని సూచించారు. కుమారి వాసిరెడ్డి సీతాదేవి, శ్రీమతి వాసిరెడ్డి కాశీరత్నం, శ్రీ మాలకొండారెడ్డి మాట్లాడారు. కార్యదర్శి మద్దాలి రఘురామ్ వందన సమర్పణ చేశారు.

## చిత్ర సుందరికి తమిళుల సత్కారం

తమిళ భాష నుంచి ఇతర భాషలలోకి పరివర్తనమైన ఉత్తమ గ్రంథాలకు తంజావూరు తమిళ విశ్వవిద్యాలయం వారు ప్రకటించిన 5000/- రూపాయల అవార్డు ఈ సంవత్సరం శ్రీ మధురాంతకం రాజారాంగారికి లభించింది. అవార్డును అందుకున్న పుస్తకం పేరు 'చిత్రసుందరి'. ఇది 'జ్ఞానపీఠ్' అవార్డు పొందిన సుప్రసిద్ధ తమిళ రచయిత శ్రీ అఖిలన్‌గారి "చిత్తిరప్పావై"కి తెలుగు అనువాదం.

కుక్కను అదిలించాలని చూచాడు. 'అబ్బో కిటికీ చాలా ఎత్తులో వుంది. అక్కడినుంచి క్రిందపడితే మరి అంతే' అనుకున్నాడు. అయినా ఈనాడెందుకో అన్నీ యిలాంటి ఆలోచనలే వస్తున్నాయి. అలా ఆలోచిస్తూనే మంచం మీదకు వాలాడు. మరునాడు సోమవారం. పనిలోకి పోవాలి మరి. దీపం చిన్నగా వెలుగుతోంది. గోడల మీద వెలుగునీడలు. నల్లని నీడలు నాట్యమాడుతున్నాయి. తనకు అమ్మ గదిలో పడుకునే అలవాటు. తెలియని ఊర్లో ఓ మారుమూల వీధిలో ఓ చీకటి మూల గదిలో తానొక్కడే వున్నాడు. కొంచం భయం. క్రొత్త అనిపించింది. గట్టిగా దిండును కావలించుకొని "హనుమాన్ చాలీసా" గుర్తుచేసుకుంటూ కండ్లు మూశాడు శ్రీరామ్. కొంచం ముగతగా వుంది. మెట్లమీద "కిల్బు కిల్బు" అనే శబ్దం. శ్రీరామ్ చెవులు నిక్కించి విన్నాడు. కొంతసేపు తరువాత అంతా నిశ్శబ్దం. నిద్రలోకి జారుకున్నాడు. అయినా ఏమిటో వికృతమైన అరుపులు. తెలియని చప్పుళ్లు. ఎవ్వరో పరుగెత్తుతున్నట్లు. ఏడుస్తున్నట్లు రాత్రంతా వినిపిస్తూనే వున్నాయి. బయట వేపచెట్టు మరీ అనవసరంగా అంత గాలి లేకపోయినా వూగుతోందనిపించింది.

* * * *

ప్రొద్దుటే ప్రార్థనకు మెలకువ వచ్చింది. జ్వరం వచ్చినట్లు ఒళ్ళంతా నొప్పులు. తలనొప్పి. రాత్రంతా పీడకలలు. తానెక్కడో సందులు గొందులు తిరిగినట్లు మెల్లిగా పక్క మీద లేచి కూర్చున్నాడు. తాను సర్దిన పుస్తకాలు బట్టలు చిందర వందరగా పడి వున్నాయి. అది ఎలా అని ఆలోచనలో పడ్డాడు శ్రీరామ్. ఏదో చప్పుడు. తలపైకెత్తి చూశాడు. అదే గుడ్లగూబ. మూల వున్న దూలం మీద కూర్చుని క్రిందకు తదేకంగా శ్రీరామ్‌నే చూస్తున్నట్లు అనిపించింది. "ఛీ. ఇదొకటి ఎంత తరిమినా వస్తుంది ....." అని గొణుక్కుంటూ లేచాడు. లేచిన వెంటనే క్రితంరాత్రి తను సొరుగులో పడేసిన కైజారు మరల బల్లమీద కనిపించింది. అదీ తెరచివుంది. 'అది పైకెలా వచ్చింది!!' ఏమీ అర్థంకాని "గజిబిజి" తలపులు. ఎలాగో ఒకలాగ దుస్తులు వేసుకొని మేడమెట్లు దిగుతుండగా బాబా కనుపించి "రాత్రి చాలాసేపు మేలుకున్నావా బాబూ .." అని అడిగాడు. "లేదే...." శ్రీరామ్ జవాబు. "ఆఁ... అలాగా...." అన్నాడు సాలోచనగా. బాబా మనుమడు "మరైతే చాలాసేపు నువ్వు అటు యిటు నడిచినట్లు చప్పుడయిందే మామజీ...." అని అడిగాడు తాత వద్దని వారిస్తున్నా కూడా. "ఏమో" అంటూ అనుమానంగా.... ఒరాకుగా బయటకు నడిచాడు శ్రీరామ్.

సాయంత్రం పని ముగిసింది. దారిలో కృష్ణమూర్తి కనబడి వద్దంటున్నా యింటికి తీసుకుపోయాడు. పిచ్చాపాటి మాట్లాడుకుంటూ "ఈ వేళ పేపరు చూచావా— ఫలక్‌నూమా అంటూ చదివాను. ఆ సందులో ఎవ్వరో ఓ అనామక రిక్షావాడిని అటకాయించారట. కత్తితో పొడవబోయారట. కానీ అదృష్టం, అది కొంచెం గీసుకొని పోయిందట. అలా భయంతో వుండిపోయాడట. కాని ఆ హంతకుడు వాడివద్ద వున్నదేమీ తీసుకోలేదట.

ఏమీ కానట్లు ఆ ఆగంతకుడు మెల్లిగా నడిచిపోయాడట. రిక్షా వాలా యిదంతా స్టేట్‌మెంట్ యిచ్చాడు. "గుర్తుపట్టలేము. ఫలక్‌నూమాలో నేనిదివరకు చూడలేదు" అన్నాడట. అయినా ఆ ఏరియాలో ఇది మామూలే" అని చెప్పుకుపోతున్నాడు కృష్ణమూర్తి. శ్రీరామ్ చిరాకుగా "పోనిద్దు పోద" అన్నాడు. 'వీడికెందుకీ కోపం' అని లోలోపలే అనుకున్నాడు.

* * * *

చాలా రాత్రి అయింది. వీధులలో సద్దు మణిగింది. దీపాలుకూడా అక్కడక్కడ వెలగడంలేదు. పొడుగాటి వీధులు. మంచుపడుతోంది. అన్ని యిండ్ల తలుపులు మూసి వున్నాయి. ఇంతదూరం రిక్షా ఎవ్వరూ కట్టనన్నారు. ఆ రాత్రివేళ ఎందుకో భయంగా వుంది. ఫలక్‌నూమా ఎలాగో చేరి మెల్లిగా రతన్‌మంజిల్ మెట్లు ఎక్కాడు తన గది చేరడానికి. అంతా నల్లని చీకటి. ఆ చీకట్లో రెండు పచ్చని దీపాలలాంటి కాంతులు అలా అలా మెరుస్తున్నాయి. అంతలోనే మాయమై మళ్ళా మెరుస్తున్నాయి. గుండె ఆగిపోయినంతపనైంది. కాసేపలా మెట్ల మీద నిలబడిపోయాడు. చెమటతో నుదురు చల్లబడింది. తననే ఎవరో చూస్తున్నట్లనిపించింది. ఒక్క అడుగు ముందుకు వేశాడు. వికృతంగా అరుస్తూ మీద కెగిరినంతపని చేసి క్రిందకు పారిపోయింది నల్లటి పిల్లి. బావురు పిల్లేమో, పెద్దగానే వుంది. "అమ్మయ్య" అనుకొని తడుముకుంటూ గది తలుపులు తెరిచాడు. గాఢాంధకారం. వీధి దీపం ఆరిపోయిందేమో. కిటికీ నుంచి నల్లని ఆకాశం తప్ప మరేమీ కనుపించలేదు. దీపం వెలిగిద్దామంటే అగ్గిపెట్టె లేదు. తను సిగరెట్లు కాల్చడు. విసుగుకుంటూ అలాగే ఆ చీకట్లో పడుకున్నాడు. రాత్రంతా కలత నిద్రలోనే వున్నాడు.

* * *


మామూలుగా తెల్లవారింది. శ్రీరామ్ లేచేసరికి గది మధ్యలో వున్న మంచం కిటికీ ప్రక్కగా వుంది. దిండు, పక్క గుడ్డలు చిందర వందరగా వున్నాయి. తలనొప్పి కళ్ళు ఎర్రగా వున్నాయి. 'ఇదేమిటి....?' అనుకొని 'ఏదో లే. గాలి లేకపోతే కిటికీ దగ్గరకు మంచం లాగానేమో' అనుకున్నాడు. కాని మనసెందుకో ఆందోళనగా వుంది. పనిమీద కూడా మనస్సు కేంద్రీకరించ లేకపోతున్నాడు. ఏదో తెలియని భయం అతనిని ఆవరించింది. ఎక్కడికైనా వెళ్ళిపోదామనిపిస్తూ వుంది. మూసిన పెట్టె కొంచెం తెరుచుకొని వుంది.

* * * *

ఆ రోజు చిరాకుగా వుంటే మొదటి ఆట సినిమా చూచి "యీసురో" అంటూ గది చేరాడు. సినిమాలో ఎవరో తెలిసిన వారు కనబడి, "రతన్ మంజిల్. దానికంత మంచి రెప్యుటేషన్ లేదు" అన్నారేగాని ఏమిటని చెప్పలేదు. అల్లకల్లోలం. అనుమానం, భీతి- అన్నీ కలిసి శ్రీరామ్‌ని ఉక్కిరి బిక్కిరి చేస్తూ వుంటే గదిచేరాడు. ఎప్పటిలాగా చీకటి. ఆరోజు గది మరీ చీకటిగా అనిపించింది. ఎలుకలు 'కిచకిచ' మంటున్నాయి అటక మీద. మిడతల అరుపులు మరీ గట్టిగా వినిపిస్తున్నాయి. మెలకువ వచ్చింది. 'అరె తాను మెట్ల మీద నిలబడివున్నాడు. అదేలా? ఎందుకు?' అయోమయంగానే గదిలోకి వెళ్ళిపోయాడు. తను బయటకు పోతుంటే బాబా కూడా అతన్ని వింతగా చూశాడు. వంట్లో నీరసంగా కూడా వుంది.

* * * *

ఆ రోజు మనస్సు మరీ ఆందోళనగా వుంది. ఇంటి నుంచి వుత్తరం కూడా రాలేదు. "వెళ్ళిపోవాలి, వెళ్ళిపోవాలి" అని తనలో ఎవరో చెప్తున్నట్లు అనిపిస్తూవుంది. చికాకుగా వుంటే

# ఎక్కడెక్కడ తగిలిందండీ తుపాకీ గుండు

ఆ బజ్జీలవాడు
ఏం చేస్తున్నాడయ్యా ఆ బజ్జీలవాడు
చచ్చే ముందు?
వాడు బజ్జీలు వేయిస్తున్నాడయ్యా మూకుడులో.

ఆ కూలి మనిషి
ఏం చేస్తున్నాడోయ్ ఆ కూలి మనిషి
ఆ చావుదెబ్బ తినే ముందు?
రోడ్డు దాటుతున్నాడోయ్ కూలిడబ్బులకోసం.

ఆ కుర్రాడున్నాడే
ఏం చేస్తున్నాడు బాబూ ఆ కుర్రాడు
ఆఖరు సారిగా కెవ్వుమనే ముందు?
సందేహం తీర్చుకోడాని కెళ్తున్నాడండీ ఎదురుగా వున్నసందులోకి

అదే ఆ మనిషి
ఏం చేస్తున్నాడండీ ఆ మనిషి
ఆఖరి పొలికేక పెట్టే ఆ కుర్రాడిమీద పడేముందు!
తన కొడుకుని రక్షించడానికొస్తున్నాడండీ గుండుదెబ్బ నుంచి.

అద్సరే
ఆ బజ్జీలవాడు. ఆ కూలి మనిషి. ఆ కుర్రాడు. ఆ మనిషి
అందరూ ఒకే సమయంలో అక్కడెందు కున్నారయ్యా?

అదా
వాళ్ళందరూ కూడా
ఆ బజ్జీలవాడు ఆ కూలి మనిషి. ఆ కుర్రాడు. ఆ తండ్రీ
అక్కడి కొచ్చేసరికి
"కడుపునిండా తిండి కావాలి"
అంటూ వూరేగే జన సమూహం అక్కడికొచ్చిందా సమయంలో

అంతే
ఇంతలోనే తుపాకీగుండు కదిలిందండి

అరే
మరి....ఆరితేరిన ఆ తుపాకీ గుండు
ఎవరెవరి కెక్కడ తగిలిందండీ

కడుపులో నండి
సుళ్ళు తిరుగుతున్న కడుపులో ఆకలికి తగిలాయండీ తుపాకీగుళ్ళు

**హిందీ మూలం : శ్రీ సోమదత్త**

**అనువాదం : భైరవయ్య**

వచ్చి గదిలో పడుకున్నాడు. అంత వరకూ బాబా తన కొడుకు ఆరేళ్ళనాడు ఎలా ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడని. ఎంత వెదికించినా "ఆచూకీ" దొరకలేదని. బ్రతికివున్న సంగతి కూడా తెలియదని తన కథ చెప్పాడు ఏడుస్తూ. చిరాకుగావున్న శ్రీరామ్ ఈ సంగతి విని మరీ చికాకైపోయాడు.

"పట్టుకోండి....పట్టుకోండి....దొంగ....దొంగ...." అనే అరుపులతో మెలకువ వచ్చింది శ్రీరామ్‌కు. చడీచప్పుడు లేని ఆ వీధిలో చాలామంది పరుగెత్తుతున్నారు. తాను మంచం మీద కాకుండా నేలమీద పడి వున్నాడు. శరీరమంతా చెమటతో తడిసి వుంది. 'పక్క మీది నుంచి క్రిందకు పడ్డాను కాబోలు....' అని అనుకొని లేచి నుంచున్నాడు. కాళ్ళు వణుకుతున్నాయి. ఆయాసంగా వుంది. అరుపులు మరీ దగ్గర్లో వినబడుతున్నాయి. తనను తాను తడిమి చూచుకున్నాడు. షరాయి....టకప్ షర్టు....కాళ్ళకు చెప్పులు. ఇదేమిటి తాను పడుకున్నప్పుడు లుంగీ కట్టుకొన్నట్లు గుర్తు. భయంగా అగ్గిపెట్టెకోసం తడిమాడు. చేతిలో ఏదో బరువుగా వుంది. గభాలున పారేశాడు. ఏమిటది? "టంగ్"మని చప్పుడు. కష్టం మీద దీపం వెలిగించాడు వణకుతున్న చేతులతో. వంకర తిరిగిన కైజారు. దానిలోని ఎర్రరంగు మరీ ఎఱ్ఱగా మెరిసింది: చేయి అంతా బంకబంకగా వుంది. చూసుకొని ఒక్కసారిగా అమ్మో అని కేకవేశాడు. రక్తం! రక్తం చేతినిండా. చొక్కామీద. అచేతనంగా వుండిపోయాడు. అంతలోనే దబదబా" తలుపులు కొట్టేరు. కేకలు పెడబొబ్బలు. పదిమందివచ్చి శ్రీరామ్‌ని కొట్టారు. నీ పేరేమిటంటే సుబ్బారావన్నాడు. బాబా విస్తుపోయాడు. కొట్టి పోలీస్‌స్టేషన్‌కు అప్పచెప్పారు. ఎందుకు ఎందుకు?? ఫలక్‌నూమా సందులోని హలీమ్ అనే యువకుడిని కైజారుతో పొడిచి తనకు కాసల్లు పోతూ వుంటే చుట్టుపక్కలవారు వెంబడించారు. పరుగెత్తుకుని రతన్ మంజిల్‌లో దూరాడు, పట్టుబడ్డాడు, కైజారుతో సహితంగా. ఆ అపరిచిత యువకుడు హంతకుడు-దొంగ, కొన్ని రోజుల క్రితం రిక్షావాడిని పొడిచింది కూడా వీడేనని నేరం మోపారు. హిందువు వచ్చి ముస్లిమ్ లోకాన్ని చంపుతున్నాడు అని పుట్టించారు వార్త. ఏ ప్రశ్నకైనా "నాకు తెలియదు" అనటంతప్ప మరేమీ జవాబియ్యలేదు శ్రీరామ్. "నిన్న నీ పేరు సుబ్బారావన్నావు. ఈవేళ శ్రీరామ్ ఎలాగయ్యింది?" అని గద్దించారు. అదేజవాబు "నాకు తెలియదు". "వీడు పెద్ద చెయ్యే" అన్నారు కొందరు.

తెల్లవారాక ఆవకాయతో సహా బండి దిగిన తల్లీ తండ్రి ఈ విషయం తెలుసుకొని పరుగు పెట్టారు జైలుకు. కిటకటాల వెనుకవున్న కొడుకును చూచి "బావురు" మన్నారు. కథంతావిని తండ్రి మరల స్వగ్రామం తిరుగు రైల్లోపోయి ఏవో కాగితాలు పోగుచేసుకొని వచ్చాడు. విచారణ సమయంలో తండ్రి తన కొడుకు శ్రీరామ్‌కు పదో ఏట నుంచి ఓ రకం జబ్బు వుందని. రాత్రి పూట అడపా తడపా అతనికి తెలియకుండానే వెళ్ళిపోతాడని. ఆ అవస్థలో అతను ఏమిచేస్తాడో తెలియదని. వాడికి గుర్తు వుండదనీ, ఒక్కోసారి రెండు మూడు రోజులవరకూ అయోమయంగా తిరుగుతూ తన వూరు పేరు కూడా మరచి పోతాడని తండ్రి చెప్పి. ఇదివరకు వెల్లూరులోను విశాఖపట్నం మానసిక వైద్యశాలలో జరిగిన ట్రీట్‌మెంటు తాలూకు. మందుల తాలూకు కాగితాలు హాజరు పెట్టాడు. కొన్ని రోజుల నుండి ఆ జబ్బు కనబడకపోతే పోయిందనుకున్నారు తల్లి తండ్రులు. అంతేగాని ఇంత వుపద్రవం వచ్చి పడుతుందను కోలేదు..... పనిచేస్తున్న కంపెనీ మేనేజర్ కూడా శ్రీరామ్ మంచి వాడని చెప్పాడు. బాబా అన్నాడు.... "అబ్బాయి చాలాసార్లు పరధ్యానంగా. చిరాకుగా వుండేవాడు. గదిలో పచార్లు చేసేవాడు. ప్రొద్దుట అడిగితే లేదనేవాడు. నా కందుకే మతి బాగుండదేమోనని అనుమానం కలిగింది."

అంతా విని కోర్టువారు శ్రీరామ్‌ని మానసికవేత్త వద్దకు పంపారు. అక్కడ "అబ్జర్ వేషన్"లో వుండగాకూడా శ్రీరామ్



శ్రీ నాట్యకళా నిలయం, విజయవాడ వారు ఇటీవల తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'శాకుంతలం' నృత్య రూపకంలో పాల్గొన్న కె.మంజుల(అనసూయ), ఎం. లక్ష్మీప్రసన్న (శా కుం త ల), ఎం. సువర్ణలక్ష్మి (ప్రియంవద)

తెలియకుండా బయట తిరుగుతూవుంటే పట్టి తెచ్చారు. మానసిక నేత్ర పరీక్షచేసి శ్రీరామ్‌కు "టెంపరల్ లోబ్ సింద్రోమ్...." అనబడే ఒకరకమైన మూర్ఛజబ్బు వుందని, ఆ జబ్బు కనిపించినప్పుడు మొదట్లో చిరాకుగా, కోపంగావుంటూ అనవసరంగా అందరిమీదా అనుమానాన్నిగాని కోపాన్నిగాని పెంచుకుంటారని అడపా దడపా ఎక్కడికైనా వెళ్ళిపోతారని, ఆ సమయంలో చేసిన పని వారికి తెలియదని, తేరుకున్నాక వారికి స్పృహలేని సమయంలో చేసిన పనులు గుర్తుండవని తెలియజేశారు. చెప్పితిన్న హలీమ్ కూడా చాలా సానుభూతి చూపించాడు. శ్రీరామ్‌ని తల్లి దండ్రులకు అప్పజెప్పి కేసు కొట్టేశారు. మందులు వాడమని డాక్టరు సలహా యిచ్చాడు. తల్లిదండ్రులతో ఇంటికి పోతున్న శ్రీరామ్‌ని చూచి బాబా "నా కొడుకూ నీలాగే వుండేవాడు. పది సంవత్సరాలక్రితం యిలానే వెళ్ళిపోయాడు-మరి రాలేదు. అప్పుడది ఓ రోగమని మాకు తెలియదు. ఆ గది వాడిదే. ప్రజలంతా ఏదో కథలు అల్లి చెప్పేవారు. నువ్వు వచ్చాక మా బాబే వచ్చాడనిపించింది" అన్నాడు కంటతడి పెడుతూ. ఫలక్‌నూమా జనం అంతా శ్రీరామ్‌ని వింతగా చూచారు. అందరికీ చిరునవ్వుతో వీడ్కోలిచ్చాడు శ్రీరామ్. రతన్ మంజిల్‌లోని మేడమీది ఆ గదికి మరల తాళం పడింది.

*

14-7-84 విడుదల
శ్రీ శ్రీనివాసా వారి నవ నవలా మాలిక!

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి - నివేదిత (డైరెక్ట్ నవల) ______ రూ. 20/-
వాసిరెడ్డి సీతాదేవి - ప్రణయ వీచికలు (జ్యోతి మాసపత్రిక సీరియల్) ______ రూ. 16/-
లల్లాదేవి - భార్గవనాగు (డైరెక్ట్ నవల) ______ రూ. 20/-
కె. రామలక్ష్మి - సుడిగాలి (డైరెక్ట్ నవల) ______ రూ. 16/-
గిరిజశ్రీ భగవాన్ - ప్రేమప్రళయం (డైరెక్ట్ నవల) ______ రూ. 16/-

శ్రీ శ్రీనివాస పబ్లిషింగ్ హౌస్
ఎ.టి. అగ్రహారం, గుంటూరు-522004

Bachi